క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: సబ్‌స్టేషన్, లైన్ల నిర్వహణ నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. చిత్తూరు నగరం, చిత్తూరు రూరల్, గుడిపాల, పెనుమూరు, జీడీనెల్లూరు, పాలసముద్రం, పూతలపట్టు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు: మండల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈశ్వరాపురం, లక్ష్మీనగర్, కళ్యాణపురం వద్ద గల 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

పీహెచ్‌సీలో అన్నదానం



గర్భిణులకు అన్నదానం చేస్తున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు పీహెచ్‌సీలో కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆర్థికసాయంతో రోగులకు శుక్రవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రోగులు ఆకలితో ఉండకూడదని ఉద్దేశంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన డాక్టర్ దుర్గాదేవి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ ప్రవీణ్, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, మండల రెడ్ క్రాస్ అధ్యక్షుడు పాపిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆధార్‌కు ఎన్‌పీసీఐ అనుసంధానం

పుత్తూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలు లబ్ధి పొందేందుకు ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డుకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)ను అనుసంధానం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలకు గల ఆధార్‌కు అనుసంధానం చేసుకోకపోతే పథకాల లబ్ధి చేకూరదని ఆయన స్పష్టం చేశారు.

ఓటరు నమోదు చేసుకోండి

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 9, 10, 23, 24 తేదీలలో ఓటరు నమోదు, సవరణలను స్వీకరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇందుకు సంబంధించి పైన తెలిపిన తేదీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ స్టేషన్ పరిధిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు వైద్య సేవలు



వైద్యసేవలు అందిస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యులు

నగరి: అడిషనల్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ ఉత్తర్వుల మేరకు స్థానిక శిరిడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక ఏరియా ఆస్పత్రి సిబ్బంది పాఠశాలలోనే వైద్యసేవలు అందించారు. శుక్రవారం పాఠశాలకు వెళ్లిన వారు అక్కడున్న దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు, పాఠశాల నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణను వినియోగించుకోండి

కార్వేటినగరం: ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ అన్నారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2025లో భాగంగా భారత ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 9, 10 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. బీఎల్‌ఓలు, ఎస్ఎస్ఆర్ 2025 ముసాయిదా ఓటర్ల జాబితాతో ఫామ్ 6, 7, 8తో వారి పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఓటర్ల జాబితాలో పేరు నమోదు, తొలగింపు సవరణ కోసం దరఖాస్తులు సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు.

అపార్ అవస్థలు



కశింమిట్ట సచివాలయంలో ఆధార్ సవరణకు బారులు తీరిన విద్యార్థుల తల్లిదండ్రులు

- అపార్ ఐడీ జనరేట్ చేయాలని విద్యాశాఖ ఆదేశాలు
- ఆధార్ కార్డుల్లో తప్పులు సరిదిద్దేందుకు సచివాలయాల వద్ద బారులు

నగరి: జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా ఆధార్ కార్డు తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఒకే దేశం–ఒకే విద్యార్థి అనే నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్ కేటాయించనున్నారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించింది. విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేస్తారు. కేజీ నుంచి పీజీ వరకూ విద్యార్థులకు ఈ–నంబర్ కేటాయించనున్నారు.

సవరణ లేకపోవడమే ఇబ్బంది

అపార్ నెంబర్ కలిగి ఉండడం ద్వారా దేశంలో ఎక్కడైనా విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. ఒకసారి కార్డు జారీ అయితే సవరణలకు నోఛాన్స్. ఇప్పటికే అపార్ నమోదు కార్యక్రమం ప్రారంభమై కొనసాగుతోంది. అయితే ఆచరణలో ఇందుకు విరుద్ధంగా దిగువ స్థాయిలో ఉంది. విద్యార్థులు జనన ధ్రువపత్రాలు, ఆధార్ ధ్రువ పత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటో, తల్లిదండ్రుల ఆధార్ నకళ్లు తదితర సర్టిఫికెట్లు అపార్ నమోదుకు కావాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించడంతోవారు తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. అంతేకాకుండా పైన పేర్కొన్న ధ్రువపత్రాల్లో ఏ చిన్న పొరపాటు ఉన్నా విద్యార్థికి అపార్ నెంబరు రాదని ఉపాధ్యాయులు కరాఖండీగా చెబుతున్నారు. ఆయా పత్రాలను వేగంగా తీసుకురావాలని ఉపాధ్యాయులు తేల్చిచెప్పడం తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా తయారైంది. ఇందుకోసం కూటమి ప్రభుత్వం తాత్కాలిక ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు చేశామని గొప్పగా చెప్పుకుంటోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఆధార్, జనన ధ్రువ పత్రాల్లోని తప్పొప్పులను ఏడాది మొత్తం అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మండలాల వారీగా వివరాలు

మండలం	పాఠశాలలు	జూనియర్ కళాశాలలు	మొత్తం విద్యార్థులు
నగరి	115	5	13535
పుత్తూరు	108	6	13026
విజయపురం	48	1	2191
నింద్ర	48	1	2179
వడమాలపేట	49	3	3058
మొత్తం	368	16	33989

ఏడాదంతా కొనసాగించాలి



ఆధార్ సేవలు సచివాలయాల్లో ఏడాదంతా కొనసాగించాలి. అలా చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులకు సంబంధిత రికార్డులకు, ఆధార్‌కు వ్యత్యాసం ఉంటే మార్చుకోవడానికి వీలుపడుతుంది. నా కుమారునికి జనన ధ్రువపత్రంలో, ఆధార్‌లో ఇంటిపేరు విషయంలో అపార్ నమోదు కాలేదు. ఆధార్ సెంటర్‌కు వెళ్లి పేరు మార్చుకోవాల్సి వచ్చింది. ఆధార్‌లో సవరణలు చేసుకోవడానికి సచివాలయంలోనే ఏడాది పూర్తిగా అవకాశం కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– డి. రేవతి, ముడిపల్లె గ్రామం

జీవితకాలం ఉపయోగపడుతుంది



ఆధార్ నెంబర్ మాదిరిగానే ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ జనరేట్ అవుతుంది. విద్యార్థికి జీవితకాల గుర్తింపుగా అపార్ ఐడీ ఉపయోగ పడనుంది. అపార్ కార్డు ఒకసారి జారీ అయితే ప్రస్తుతానికి సవరణకు అవకాశం లేదు. దీంతో నమోదు విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నాం. విద్యార్థి పేరు, తదితర వివరాల్లో ఏమైనా తప్పొప్పులు ఉంటే వెంటనే ఆధార్ సెంటర్‌కు వెళ్లి సరి చేసుకోవాలి. ముఖ్యంగా ఈ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నగరి మండలంలో 60 శాతానికి పైగా అపార్ వివరాలు నమోదు పూర్తయ్యింది.

– శ్రీదేవి, ఎంఈఓ, నగరి మండలం

రెవెన్యూ అధికారుల బంధుప్రీతితోనే వివాదం



గురవారెడ్డి

వెదురుకుప్పం: రెవెన్యూ అధికారుల బంధుప్రీతితోనే వివాదం నెలకొందని మాంబేడు మాజీ ఎంపీటీసీ, వైఎస్ఆర్ సీపీ నాయకుడు గురవారెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాంబేడు గ్రామంలో రెవెన్యూవారికి బంధువులు ఉన్నారని తెలిపారు. వంక కాలువలో రోడ్డు వేసేందుకు బంధువులను ఉసిగొల్పి వివాదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. వందల ఎకరాలు ముంపునకు గురవుతాయనే జ్ఞానం కూడా లేకుండా స్వప్రయోజనాల కోసం రోడ్డు నిర్మాణం చేపట్టాలన్న ఉద్దేశంతో నింబంధనలను అతిక్రమిస్తున్నారని విమర్శించారు. మండలంలో ఉన్న వీఆర్‌ఓలు, సర్వేయర్లు, పోలీసులను పిలిపించి గ్రామంలో భయానక వాతావరణాన్ని కల్పిస్తున్నారని తెలిపారు. నిజంగా దారి సమస్య ఉంటే పరిష్కరించాలే తప్ప ఒకరిద్దరి కోసం ఉన్న ఒరవ కాలువను పూడ్చి వేయడం తగదన్నారు. అధికార పార్టీ నాయకులు కావడంతో నిబంధనలను పక్కన పెట్టి కాలువను జేసీబీతో పూడ్చి వేస్తున్నట్లు తెలిపారు. వంకలో రోడ్డు వేస్తే వరదల సమయంలో కొట్టుకుపోతుందని తెలిసినా పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను గురించి పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న ఒంటెద్దు పోకడలను విరమించుకోవాలని ఆయన హెచ్చరించారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌ఓ సుశీల, సునీత

పాలసముద్రం: వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యం పాలు కాకుండా ఉంటారని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు హెచ్‌ఎం శ్యామలమ్మ, ఎంఎల్‌హెచ్‌ఓ సునీత సమక్షంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తప్పకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. డైటింగ్ పేరుతో చాలా మంది విద్యార్థులకు అతి తక్కువగా తింటూ బలహీనతకు గురవుతుంటారని తెలిపారు. అటువంటి వారు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కచ్చితంగా ఐరన్ టాబ్లెట్లు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం రేవతి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



పాలసముద్రం: మండలంలోని గంగమాంబపురం గ్రామానికి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌కు బ్రేకులు పడకపోవడంతో 20 అడుగుల లోయలో బోల్తా కొట్టింది. శుక్రవారం జరిగిన ఈ సంఘటనలో డ్రైవర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. ఎన్ఆర్ పేట నీవానది నుంచి ఇసుక ట్రాక్టర్ బయల్దేరింది. టీపీ ఎస్ఆర్ పురం గ్రామంలో సమీపంలో కొండపై నుంచి వస్తున్నప్పుడు ట్రాక్టర్‌కి బ్రేకులు పడకపోవడంతో అదుపుతప్పి 20 అడుగుల లోయలో పడిపోయింది. ట్రాక్టర్ ఇంజిన్ రెండుగా అయిపోయింది. డ్రైవర్ మధు తలకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని షోలింగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీస్ వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఎస్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి

వెదురుకుప్పం: గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎస్ మూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని జక్కిదొన గ్రామ సచివాలయంలో గిరిజనులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడైనా భూ, వ్యక్తిగత సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చొరవ చూపుతున్నట్లు పేర్కొన్నారు. ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యపరంగా ప్రభుత్వ వైద్య సేవలు అందకుంటే తక్షణమే మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు, ఆర్థికంగా వృద్ధి చెందేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఎస్టీల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. పిల్లలను గురుకులాల్లో చేర్పించి వారిని అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అమర్‌నాథ్, సర్పంచ్‌లు కావేరి, శ్రీనాథ్, కమ్యూనిటీ మెడికల్ అధికారి గోవిందస్వామి, గంటావారిపల్లె కార్యదర్శి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు



చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ పార్వతి



జీడీ నెల్లూరులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీఓ పార్వతి

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ రాజ్ శాఖాధికారి పార్వతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో అలసత్వం ఉండకూడదని, రక్షిత మంచినీటి ట్యాంకులను 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా పంచాయతీ సెక్రటరీలు ఆరోగ్య సిబ్బందితో కలిసి వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో మరుగుదొడ్లు లేని వారిని గుర్తించి వాటి నిర్మించాలన్నారు ఓవర్ హెడ్ ట్యాంకర్లను నెలలో రెండుసార్లు శుద్ధి చేయించి జియో టాగింగ్ ద్వారా ఫొటోలు, వీడియోలను రికార్డ్ చేయించాలన్నారు. అనంతరం డీపీఓ పార్వతి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. బయోమెట్రిక్ అటెండెన్స్ సరిగా చేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించాలని చెప్పారు. పంచాయతీలో ఇంటి పన్నుల రికార్డులు నిర్వహించాలని పారిశుధ్య పనులు మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ సెక్రటరీలు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగు పరచండి



కార్వేటినగరం బ్రాహ్మణ వీధిలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

కార్వేటినగరం: పంచాయతీల్లో పారిశుధ్యం లోపాలు లేకుండా మెరుగ్గా ఉండేలా చూడాలని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బ్రాహ్మణవీధిలో కార్మికులు చేపట్టిన పారిశుధ్య పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి పంచాయతీలో పారిశుధ్య లోపాలను గుర్తించి మెరుగు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని తెలిపారు. బ్లీచింగ్ చల్లి దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పంచాయతీ పరిధిలోని కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి, మరమ్మతులకు గురైన డ్రైనేజీలను, పైపులైన్లను గుర్తించి వాటి మరమ్మతులు చేపట్టాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేని గుర్తించి వాటి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసి త్వరగా నివేదించాలని సూచించారు. ప్రజలు ఎక్కడా వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కార్యదర్శులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ నాగరత్నమ్మ, పంచాయతీ సిబ్బంది హరి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సమన్యాయం అందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ప్రభుత్వ న్యాయవాది జగదీషన్

నగరి: ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా అందరికీ సమన్యాయం అందించాలన్నదే న్యాయ సేవల దినోత్సవ ఉద్దేశమని నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది జగదీషన్ అన్నారు. న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోర్టు సిబ్బంది, కళాశాల సిబ్బంది సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలలో చట్టాలపై అవగాహన కల్పించడం, వివిధ వ్యక్తుల మధ్య, సంస్థల మధ్య సామరస్యపూర్వక మార్గంలో పరిష్కారాన్ని సూచించాలన్నారు. ఈ లక్ష్యాలతో ప్రతి సంవత్సరం నవంబర్ 9న జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ మాట్లాడుతూ కొద్దిపాటి న్యాయ అవగాహన జీవితంలో అనేక సమస్యల నుండి ఉపశమనం పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎన్నో సందర్భాలలో అధికార నిరంకుశత్వానికి, దర్పానికి న్యాయ అవగాహన లేని సామాన్యులు, అమాయకులు బలి అవుతారన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నతంగా ఉన్నవారు సైతం అన్యాయానికి గురవుతారని తెలిపారు. కావున విద్యార్థులు న్యాయ అక్షరాస్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భాస్కర రాజు, న్యాయవాది మోహన్, ఐక్యూ కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సుహాసిని, కోర్టు సిబ్బంది బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా తరగతులు నిర్వహించాలి



విద్యార్థిని ప్రశంసిస్తున్న డీవైఈఓ

నగరి: తరగతులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని డీవైఈఓ ప్రభాకర్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ముడిపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా సెల్ఫ్ అసెస్మెంట్ ఇంగ్లీష్ ఎగ్జామ్ రాస్తున్న పిల్లలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్స్ పరిశీలించి సూచనలు చేశారు. ఈ సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రత్యేక తరగతులు ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని సూచనలు చేశారు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన 9వ తరగతి విద్యార్థిని నవ్యకు ఉపాధ్యాయుడు ఆనందమోహన్ రూ.1116 ప్రోత్సాహంగా అందించగా, డివైఈఓ రూ.500 అందజేసి, ప్రసంశలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

పుత్తూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మునివేలు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కోరారు. ఎంపీడీఓ రమేష్‌బాబు మాట్లాడుతూ సామాజిక సర్వే జరుగుతోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సర్వేతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాల లబ్ధి పొందే అవకాశం ప్రజలకు కలుగుతుందని తెలిపారు. వ్యవసాయాధికారి కె.కోదండయ్య మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తనాలు 36 రకం 304 క్వింటాళ్లు వచ్చాయని తెలిపారు. 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరమయ్యే రైతులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారి వెంకటసౌజన్య మాట్లాడుతూ వంద శాతం సబ్సిడీతో పామాయిల్ మొక్కలు అందిస్తామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్తరకం డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మూడేళ్ల పాటు సబ్సిడీ అవకాశం ఉందని తెలిపారు. కూరగాయల సాగుకు రూ.20 వేలు సబ్సిడీ అవకాశం ఉందన్నారు. మామిడిలో ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి

నగరి: పట్టణ పరిధిలోని కరకంటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్కంధషష్టి వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామివార్లకు చందన, పంచామృతాభిషేకాలు చేసి, పలురకాల హారతులు ఇచ్చారు. భక్తులకు కల్యాణోత్సవ విందుగా అన్నదానం చేశారు. సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించి భక్తుల దర్శనార్థ మండపం వద్ద ఉంచారు. రాత్రి పుష్పాలంకరణతో స్వాములను ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఉత్సవ ఉభయదారులకు నిర్వాహకులు ఆలయ మర్యాదలు చేసి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో నలుగురికి జైలుశిక్ష



నిందితులను జైలుకు తరలిస్తున్న పీసీ

నగరి: వరకట్నం తేవాలని వేధించిన కేసులో నలుగురికి స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శిక్ష విధించారు. సీఐ మహేశ్వర్ తెలిపిన వివరాల మేరకు నాగలాపురం మండలం వెల్లూరు దళితవాడకు చెందిన బద్రి నింద్ర మండలం ఆరూరు వడ్డిండ్లు చెందిన గ్రేసీని ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. వివాహానంతరం అతనితోపాటు అతని తల్లిదండ్రులు వరకట్నం కోసం గ్రేసీని వేధించడం ప్రారంభించారు. దీంతో గ్రేసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఏపీపీ రమాశాంతి వాదనలు విన్న జడ్జి గోపాలకృష్ణ నిందితులైన పి.బద్రి అతని తల్లిదండ్రులు ఆర్.పురుషోత్తం, అంజలి, అక్క ఎస్.సంగీతలకు రెండున్నరేళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు చొప్పున జరిమానా విధించారు. కోర్టు పీసీ చిరంజీవి వారిని జైలుకు తరలించారు.

బాలగురునాథీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంతో స్వామివారు

పాలసముద్రం: మండలంలోని రాచపాల్యం గ్రామంలో వెలసిన బాలగురు నాథీశ్వరస్వామికి కార్తీక నెల శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలో దీపారాధన పూజలు చేపట్టారు. సాయంత్రం ప్రతి ఇంటి నుంచి మహిళలు పిండి దీపాలతో గ్రామాల్లో ఊరేగించి, స్వామివారి గుడి ఆవరణలో దీపాలు వెలిగించారు. వేదపండితులు స్వామివారిని వివిధ అభిషేకాలు చేసి భక్తులు తీసుకొచ్చిన వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు తమిళనాడు, కర్ణాటక, మండల పరిధిలోని భక్తులు ఆలయంలో కిటకిటలాడారు.

శ్మశాన స్థల వివాదం పరిష్కరించండి



ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పుత్తూరు: తడుకు పంచాయతీ పరిధిలోని రంగుంట ఎస్టీ కాలనీకి చెందిన శ్మశాన స్థల వివాదాన్ని పరిష్కరించాలని గ్రామస్తులు శుక్రవారం పుత్తూరుకు విచ్చేసిన ఆర్డీఓ బి.రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తడుకు రెవెన్యూ లెక్క దాఖల సర్వే నెంబర్ 272/2లోని భూమి శ్మశాన స్థలంగా కొన్ని దశాబ్దాలుగా కాలనీ ఆధీనంలో ఉందని తెలిపారు. అయితే ఇటీవల ఓ వ్యక్తి శ్మశాన స్థలాన్ని మరోచోట చూసుకోవాలంటూ కాలనీవాసులను బెదిరిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామ సమస్యను పరిష్కరించాలని డీటీ అశోక్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం కార్యదర్శి నందయ్య, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు శ్రీనివాసులు, గ్రామస్తులు బాలయ్య, నాగరాజు, శేఖర్, గిరి తదితరులు పాల్గొన్నారు.